విశాలాంధ్ర అనంతపురం
www.visalaandhra.com
కర్నూలు, బుధవారం 1, మే 2024

స్ట్రాంగ్ రూంల వద్ద పటిష్ట ఏర్పాటు చేపట్టాలి..

ఎన్నికల సాధారణ పరిశీలకులు మనీష్ సింగ్, సి.అజయ్ నాథ్

విశాలాంధ్ర-అనంతపురం వైద్యం : సాధారణ ఎన్నికలు - 2024 కోసం నగరంలోని జేఎన్టీయూలో ఏర్పాటు చేస్తున్న స్ట్రాంగ్ రూమ్‌లు, రిసెప్షన్, కౌంటింగ్ కేంద్రాల్లో పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టాలని ఎన్నికల సాధారణ పరిశీలకులు మనీష్ సింగ్, సి.అజయ్ నాథ్‌ఝు, పోలీస్ పరిశీలకులు రవి కుమార్ ఆదేశించారు. మంగళవారం అనంతపురం నగరంలోని జేఎన్టీయూలో జిల్లాలోని పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి ఏర్పాటు చేస్తున్న కౌంటింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్ లు, రిసెప్షన్ కేంద్రాలను జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ వినోద్ కుమార్.వి, జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్‌లతో కలసి గుంతకల్లు, తాడిపత్రి, సింగనమల, అనంతపురం అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన ఎన్నికల సాధారణ పరిశీలకులు మనీష్ సింగ్, అనంతపురం పార్లమెంటు నియోజకవర్గం, జిల్లాలోని రాయదుర్గం, ఉరవకొండ, కళ్యాణదుర్గం అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన ఎన్నికల సాధారణ పరిశీలకులు సి.అజయ్‌నాథ్ ఝు, అనంతపురం పార్లమెంటరీ నియోజకవర్గానికి సంబంధించిన ఎన్నికల పోలీస్ పరిశీలకులు రవికుమార్ తనిఖీ చేశారు. పరిశీలకులు మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలను అనుసరించి స్ట్రాంగ్ రూమ్‌లు, రిసెప్షన్, కౌంటింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. సరైన విధంగా బ్యారికేడింగ్, లైట్లు, ఫ్యాన్లు, కుర్చీలు ఏర్పాటు చేయాలని, కౌంటింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలన్నారు. పోలింగ్ పూర్తి అయ్యాక ఆయా నియోజకవర్గాల నుంచి స్ట్రాంగ్ రూమ్‌కు ఈవీఎంలను తరలించే బస్సులు వచ్చివెళ్లేందుకు జాగ్రత్తగా ఏర్పాట్లు చేయాలన్నారు. వేగవం తమైన ఇంటర్నెట్ సౌకర్యాన్ని ఏర్పాటు చేయాలన్నారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు ఉండాలన్నారు. పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కలెక్టర్ వినోద్ కుమార్ మాట్లాడుతూ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు పక్కాగా ఉండాలని అధికారులను ఆదేశించారు. మంగళవారం మధ్యాహ్నంలోపు ఈ ప్రక్రియను పూర్తి చేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో నగర పాలక సంస్థ కమిషనర్ మేఘ స్వరూప్, అసిస్టెంట్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న, అడిషనల్ ఎస్పీలు విజయభాస్కర్ రెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి

కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వై.మధుసూదన్ రెడ్డి

విశాలాంధ్ర-ఉరవకొండ: కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటేనే అభి వృద్ధి సాధ్యమని ప్రజలందరూ రానున్న సార్వత్రిక ఎన్నికలలో హస్తం గుర్తుకు ఓట్లు వేసి గెలిపించాలని ఉరవకొండ నియోజకవర్గం కాంగ్రెస్, సిపిఐ, సిపిఎం పార్టీల కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వై.మధు సూదన్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఉరవకొండ ఇంద్రానగర్, అంబే ద్కర్‌నగర్ కాలనీలో ఆయన ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం ఉరవకొండ పట్టణాభివృద్ధికి ఎలాంటి నిధులు విడుదల చేయలేదన్నారు. పట్టణంలో తీవ్రమైన తాగునీటి సమస్య పరిష్కారానికి కూడా ఎలాంటి చర్యలు చేపట్టలేదు అన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలిస్తే తాగునీటి సమస్యకు పరిష్కారం చూపుతానని, పట్టణాన్ని ఆదర్శ నగరంగా తీర్చిదిద్దుతానని తెలిపారు. విభజన హామీలతో పాటు ప్రతి మహిళకు లక్ష రూపాయల నగదు, రైతులకు 2 లక్షల రూపాయల రుణమాఫీ, రైతుల పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు ప్రతి సంవత్సరం 2.20 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు కేజీ నుండి పీజీ వరకు ఉచిత విద్య నాలుగు వేల రూపాయల పింఛన్లు వికలాంగులకు 6వేలు అందివ్వడం జరుగుతుం దన్నారు. తనను గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.

ప్రజా సంక్షేమమే జగనన్న ధ్యేయం

వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వీరాంజనేయులు

విశాలాంధ్ర-శింగనమల : జగనన్న చెప్పారంటే. చేస్తారని శింగనమల వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.వీరాంజనేయులు అన్నారు. గార్లదిన్నె మండలం మర్తాడు గ్రామంలో మన ఊరికి మన వీరా కార్యక్రమంలో భాగంగా అనంతపురం ఎంపీ అభ్యర్థి ఎం. శంకర్ నారాయణ, జిల్లా పార్టీ అధ్యక్షుడు పైలా నరసింహయ్య, మాజీ ఏడీసీసీ చైర్మన్ పామిడి వీరాంజనేయులు, రాష్ట్ర రజక కార్పొరేషన్ చైర్మన్ రంగన్నతో కలసి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను వివరించారు, రోడ్ షోలో పాల్గొన్నారు, ఎమ్మెల్యే అభ్యర్థి అయిన తనను, ఎంపీ అభ్యర్థి అయిన శంకర్ నారాయణను అధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. మళ్లీ ఐదేళ్ల పాటు సంక్షేమ పథకాలు అమలు కావాలంటే మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిగా చేసుకోవాలని కోరారు. అబద్దాల పునాదులపై గాలి మేడలు కట్టడం చంద్రబాబు నాయుడిని నమ్మవద్దన్నారు. నియోజకవర్గ ప్రజలు తనను మెజార్టీతో గెలిపిస్తే సేవకుడిగా పనిచేస్తానని ప్రజలను కోరారు, అబద్ధాల చంద్రబాబు మాయమాటలు నమ్మవదన్నారు.

గెలుపు మాదే... తోపుదుర్తి..

విశాలాంధ్ర-రాప్తాడు: వచ్చే నెల 13వ తేదీన జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీదే గెలుపని తాను అత్యధిక మెజారిటీ సాధించి అసెంబ్లీలో అడుగుపెట్టడం ఖాయమని ఎమ్మెల్యే తోపు దుర్తి ప్రకాష్‌రెడ్డి అన్నారు. మండలంలోని పాలచెర్ల, భోగినేపల్లి, కందుకూరు గ్రామాల్లో మంగళ వారం పార్టీ శ్రేణుల భారీ జన సందోహం మధ్యన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చిన వెంటనే రైతుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని హంద్రీనీవా కాలువ ద్వారా 3700 ఎకరాలకు సాగునీరు ఇచ్చేలా భోగినేపల్లి గ్రామం వద్ద కాలువ తవ్వించామన్నారు. ఎమ్మెల్యేగా, మంత్రిగా పదేళ్లు పనిచేసిన మాజీ మంత్రి పరిటాల సునీత నియోజకవర్గానికి చేసిన అభివృద్ధి శూన్యమని విమర్శించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైసీపీకి దక్కిందన్నారు. పేరూరు డ్యాంకు నీరు తీసుకువచ్చి ఇచ్చిన మాట నెరవేర్చామని తెలిపారు. చంద్రబాబు మోస పూరిత హామీలను, పరిటాల కుటుంబాన్ని నమ్మే పరిస్థితుల్లో లేరన్నా రు. మరోసారి జగన్‌ను సీఎంగా చేసుకునేందుకు ఎమ్మెల్యేగా తనను, ఎంపీ అభ్యర్థి బోయశాంతమ్మను గెలిపించాలన్నారు

మాతృ మరణాలు అరికట్టాలి

- జిల్లా వైద్య,ఆరోగ్య శాఖ అధికారి ఈ.బి దేవి

సమావేశంలో మాట్లాడుతున్న ఈ .బి దేవి

విశాలాంధ్ర-అనంతపురం వైద్యం: జిల్లా వైద్య,ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఈ .బి దేవి అధ్యక్షతన గత మాసంలో జిల్లాలో జరిగిన మాతృమరణాలుకు గల కారణాలపైన వైద్య సిబ్బందితో మంగళవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఈబి దేవి మాట్లాడుతూ.. శిశు మరణం కానీ మాతృ మరణం కానీ జరిగినప్పుడు మరణానికి గల కారణాలు తెలుసుకొని. మరోసారి అలాంటి కారణంతో మరణం జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఐసీడీయస్. ప్రాజెక్టు వారు గర్భిణులకు అందించే న్యూట్రీషన్ ఫుడ్‌ను వారు సంపూర్ణంగా తీసుకొనేలా చొరవ తీసుకోవాలన్నారు. మాతృ మరణం జరిగినప్పుడు జిల్లా నోడల్ టీం కూడా క్షేత్రస్థాయికి వెళ్లి విచారించాలన్నారు. ప్రతి గర్భిణీ 12 వారలలోపు రిజిస్ట్రార్ చేసుకొని అన్ని రకాల వైద్య పరీక్షలు. వైద్యసేవలు అందించాలని కోరారు. ఏ తల్లి ప్రసవ అనంతరం అధిక రక్తస్రావంతో మరణించ కూడదని తెలిపారు. మదర్ అండ్ చైల్డ్ హెల్త్ నోడల్ ఆఫీసర్ డాక్టర్.యుగంధర్ మాట్లాడుతూ రక్త హీనత వున్నా, గుండె సంబంధిత సమస్యలు వున్నా, తక్కువ ఎత్తు,, తల్లి గర్భంలో ఉమ్మనీరు తక్కువ వున్నా, బిడ్డ పెరుగుదల లేకపోయిన, హైరిస్క్ గర్భిణులను గుర్తించి వారికీ ప్రత్యేక వైద్యసేవలు అందించాలని కోరారు. సమావేశంలో జిల్లా ఆసుపత్రుల కో ఆర్డినేటర్ డా పాల్ రవికుమార్, డీఐఓ డా.యుగంధర్, ప్రభుత్వ ఆసుపత్రి వైద్య నిపుణులు డా.నవీన్ పాల్గొన్నారు.

ముస్లింల రిజర్వేషన్లను ఎత్తివేస్తామన్న బీజేపీ ప్రకటనపై చంద్రబాబు స్పందించాలి

విశాలాంధ్ర-ఉరవకొండ : ఎన్డీఏ కూటమి అధికారంలోకి వస్తే రాష్ట్రంలో ముస్లింలకు ఉన్న నాలుగు శాతం రిజర్వేషన్లను ఎత్తివేస్తామని బీజేపీ జాతీయ నాయకులు, కేంద్ర మంత్రులు బహిరంగంగా ప్రకటనలు చేస్తున్నారని దీనిపై కూటమిలో భాగస్వామ్యమైన చంద్రబాబు నాయుడు ముస్లింలకు సమాధానం చెప్పాలని వైసీపీ ఉరవకొండ ఎన్నికల ఇంచార్జ్ కెవి రమణ, మైనార్టీ విభాగం పార్టీ సీనియర్ నాయకులు ఎంఏ జిలాన్, జేఏసీ కన్వీనర్ ఆసిఫ్, మండల కోఆప్షన్ సభ్యులు పామిడి సలీం, జిల్లా వక్ఫ్ బోర్డు మెంబర్ మీరంబాషా, పీఏసీఎస్ చైర్మన్ వడ్ల శైక్షవలి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక వైసీపీ పార్టీ కార్యాల యంలో వైసీపీ ప్రభుత్వంలో ముస్లింల అభివృద్ధికి జరిగిన అంశాలపై ముద్రిం చిన కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ చంద్రాబాబూ ముస్లింలను మోసం చేయాలని ప్రయత్నిస్తే పుట్టగతులు ఉండవ న్నారు. ముస్లింల జీవితాలతో ఆడుకునే హక్కు చంద్రబాబుకు ఎవరిచ్చారని ప్రశ్నించారు. బీజేపీ నేతలంతా తాము అదికారంలోకి వస్తే ముస్లిం రిజర్వేషన్లు తీసేస్తానంటున్నారు. వాళ్లతో ఆ ప్రకటనలు ఉపసంహ రించుకునేలా చేసే దమ్ముందా. అని ప్రశ్నించారు. రిజర్వేషన్ల అంశం సుప్రీం కోర్టులో ఉందంటూ చంద్ర బాబు తప్పుకోవడం ఎంతవరకు సబబుని ప్రశ్నించారు గతంలో గుంటూరులో నారాహమారా సదస్సులో నంద్యాలకు చెందిన పేద ముస్లిం యువకులపై దేశద్రోహం కేసులు పెట్టారని, దాచేపల్లిలో మైనారిటీలను వాళ్ళని జైల్లో పెట్టడం జరిగిందన్నారు. గతంలో 650 హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిన వ్యక్తి చంద్రబాబుని పేర్కొన్నారు. టిడిపి పాలనలో 2,300 కోట్ల రూపాయలు ఖర్చుపెడితే జగన్ ప్రభుత్వంలో 21వేల కోట్ల రూపాయలకుపైగా ముస్లింల కోసం కేటాయించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో టౌన్ ప్రెసిడెంట్ పామిడి జాకీర్ సచివాలయం కన్వీనర్ అన్వర్, పార్టీ సీనియర్ నాయకుడు కె.బషీర్, మల్ల యుమస్ యజాజ్, శన్ను, వడ్ల శామీర్ పాల్గొన్నారు.

ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయాలి

విశాలాంధ్ర-ఉరవకొండ: ఉరవకొండ పట్టణంలో తీవ్రమైన నీటి సమస్య ఉన్నందువల్ల ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని పంచాయతీ సమావేశంలో సభ్యులు తీర్మానం చేశారు. మంగళవారం మేజర్ గ్రామపంచాయతీ అత్యవసర సమావేశాన్ని సర్పంచ్ లలిత అధ్యక్షతన ఏర్పాటు చేశారు. వార్డు సభ్యులు మాట్లాడుతూ పట్టణంలో తాగునీటి సమస్య తీవ్ర రూపం దాల్చిందని ట్యాంకర్లు ద్వారా మంచి నీటిని సరఫరా చేయడానికి తమకు ఎలాంటి అభ్యంతరం లేదని ఉప్పునీటిని సరఫరా చేయడానికి తాము వ్యతిరేకమన్నారు. ఇప్పటికే పట్టణంలో పెద్ద ఎత్తున సిస్టం ట్యాంకులు ఉన్నాయని వాటి ద్వారా ప్రజలు నీటిని వాడుకుంటున్నారని పేర్కొన్నారు. సర్పంచ్ లలిత, కార్యదర్శి గౌస్ సాహెబ్ మాట్లాడుతూ తాత్కాలికంగా గ్రామ పంచాయతీ సాధారణ నిధులను ఉపయోగించి ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తామని తర్వాత ఆర్డబ్ల్యూఎస్ అధికారులే పట్టణంలో ట్యాంకర్ల ద్వారా మంచినీటిని అందిస్తారని తెలిపారు. ఈ సమావేశంలో ఉపసర్పంచ్ వన్నప్ప, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

పామిడి భాష సేవలు మరువలేని..

విశాలాంధ్ర-ఉరవకొండ : ఉరవకొండ ఆర్టీసీ డిపోలో సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన పామిడి భాష సేవలు మరువలేనివని డిపో మేనేజర్ బాలాజీ దయాల్ అన్నారు. ఆర్టీసీలో సుదీర్ఘకాలం పనిచేసి మంగళవారం పదవీ విరమణ చేసిన పామిడి భాషని డిఎం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మేనేజర్ మాట్లాడుతూ పామిడి భాష వివిధ హెూదాల్లో పని చేస్తూ నేడు సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్పెక్టర్‌గా పదవీ విరమణ చేస్తున్నారన్నారు, తమ విధి నిర్వహణ పట్ల ఎంతో క్రమ శిక్షణతో అంకితభావంతో పనిచేసే ప్రజల మన్ననలు పొందారన్నారు, ఆర్టీసీబస్సుల్లో ప్రయాణికులను సురక్షితంగా తీసుకోవడానికి డ్రైవర్ ఎంతో కీలకపాత్ర వహిస్తారని అలాంటి వ్యక్తులకు డ్రైవింగ్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు సలహాలు ఇస్తూ వారిని చైతన్యవంతులు చేసి అవగాహన కల్పించారన్నారు, అలాంటి వ్యక్తి నేడు పదవీ విరమణ చేయడం ఓ పక్క బాధ అనిపించినా మరో పక్క ఆయన శేష జీవితం సుఖ సంతోషాలతో నలవాలని ఆకాంక్షించారు. ఆర్టీసీ డ్రైవర్లు సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్రీయ విశావిద్యాలయంలో ఉచిత స్వల్పకాలిక శిక్షణ...

విశాలాంధ్ర-అనంతపురం వైద్యం: అనంతపురంలోని కేంద్రీయ విశ్వవిద్యాలయం, రాజనీతి శాస్త్రం , జనరల్ స్టడీస్ తో పాటు రాజ్యాంగం, రాజకీయం ప్రభుత్వ సంబంధిత అంశాలపై రెండు ఉచిత ఆన్‌లైన్ స్వల్పకాలిక శిక్షణాతరగతులను అందిస్తోందని కేంద్రీయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఎస్ఏ కోరి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పోటీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఈ కోర్సులు ఉపయోగపడతాయి. ఉచిత సమగ్ర శిక్షణ మరియు మార్గదర్శన కార్యక్రమాల ద్వారా విద్యాపరమైన అసమానతలను పరిష్కరించడానికి, వెనుకబడిన విద్యార్థులకు సాధికారత కల్పించడానికి కేంద్రీయ విశ్వవిద్యాలయం అర్థవంతమైన ప్రయత్నం చేస్తోందన్నారు. ప్రోగ్రామ్ వ్యవధి: 6 మే 2024- 30 జూన్ 2024 ఆన్‌లైన్ తరగతులు- 3-5 పిఎం (వారానికి రెండు రోజులు) ఈ వివరాల కోసం వెబ్సైట్ డబ్ల్యూ డబ్ల్యూ. సి యూ ఏపీ. ఏ సి. ఇన్ కోర్సుల కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు.

డిగ్రీ పరీక్షలలో ముగ్గురు విద్యార్థులు డీబార్

విశాలాంధ్ర-జెఎన్‌టియుఏ: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం యూజీ రెండు , అరు సెమిస్టర్ పరీక్షలలో అనంతపురం పివి కేకే డిగ్రీ కళాశాలలో ఒకరని, గుంతకల్ సాయి డిగ్రీ మహిళా కళాశాలలో ఒకరని, కళ్యాణదుర్గం వివేకానందడిగ్రీ కళాశాల లో ఒకరని బుక్ చేసి డిబార్ చేసినట్లు పరీక్షల విభాగపు సంచాలకులు ఆచార్య జివి రమణ తెలిపారు.పరీక్షలలో కాపింగ్ పాల్పడి విలువైన సమయాన్ని, జీవితాన్ని పణంగా చేయవద్దని సూచించారు.పరీక్షలపై ఇష్టపడి చదివి.. పరిపూర్ణ జ్ఞాన సంపాదన ఆర్జిస్ట్ ప్రతి విద్యార్థి విజయ ఫలాలను అధిరోహించగలరన్నారు.

టీడీపీ నాయకుల మమ్మర ప్రచారం

విశాలాంధ్ర-యాడికి : మండల కేంద్రంలోని చౌడేశ్వరి కాలనీ, చెన్నకేశవ స్వామి కాలనీల్లో యాడికి మండల టీడీపీ నాయకులు ఎన్నికల మమ్మార ప్రచారం చేశారు. ఆయా కాలనీలలో స్థానికుల ఇళ్ల వద్దకు వెళ్లి తెలుగుదేశం పార్టీ అభ్యర్థి జేసీ అస్మిత్ రెడ్డి సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. బీసీ లకు 50 సంవత్సరాలకే పెన్షన్, మహిళ లకు ఉచిత బస్సు ప్రయాణం, ఎంతమంది విద్యార్థులు చదువుతున్నా అందరికీ ప్రతి సంవత్సరం రూ.15 వేలు వస్తుందన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే ఇప్పుడున్న సామాజిక పెన్షన్ 3వేల నుండి 4 వేల రూపాయలకు పెంచుతామన్నారు. భూమి ఉన్న ప్రతి రైతుకు సంవత్సరానికి రూ.20 వేలు వస్తాయన్నారు. చేనేతలకు 200 యూనిట్ల వరకు కరెంటు ఉచితమన్నారు. మరమగ్గాలున్న చేనేతలకు 500 యూనిట్ల వరకు ఉచిత కరెంటు అన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గొర్తి రుద్రమ నాయుడు, మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య, పట్టణ అధ్యక్షుడు వెలిగండ్ల ఆదినారాయణ, మండల బీసీ సెల్ అధ్యక్షుడు తీరంపురం నీలకంఠ, జనసేన మండల కన్వీనర్ సునీల్ బిజెపి కన్వీనర్ గంగాధర్, సుభాన్ పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా వాహనాల తనిఖీలు

విశాలాంధ్ర-అనంతపురం వైద్యం : ఎస్పీ అమిత్ బర్దర్ ఆదేశాల మేరకు డీఎస్పీలు, సిఐలు, ఎస్ఐలు, కేంద్ర సాయుధ బలగాలు, స్పెషల్ పార్టీ పోలీసులతో కలిసి మంగళవారం విస్తృతంగా వాహనాల తనిఖీ చేపట్టారు. ఓటర్లను ప్రభావితం చేయకుండా డబ్బులు, ఇతర గిఫ్ట్ ఆర్టికల్స్, లిక్కర్ అక్రమ రవాణా జరగకుండా చర్యలు తీసుకున్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున రూ.50 వేల కంటే ఎక్కువ డబ్బులు వెంట తీసుకుని వెళ్లకూడదని సూచిస్తున్నారు. ఎవరైనా అత్యవసరంగా డబ్బులు తీసుకొని వెళితే సంబంధిత ఆధారాలు తప్పకుండా వెంట ఉంచుకోవాలని తెలియజేస్తున్నారు.

సమస్యాత్మక గ్రామాలపై పోలీసుల దృష్టి

విశాలాంధ్ర-అనంతపురం వైద్యం: జిల్లాలోని సమస్యాత్మక గ్రామాలపై ఆయా పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. ఎన్నికల వేళ ఎలా మెలగాలో గ్రామసభల ద్వారా ప్రజలకు దిశానిర్దేశం చేస్తున్నారు. గొడవలు, అల్లర్లకు దూరంగా ఉండాలని సూచిస్తున్నారు. ప్రశాంత ఎన్నికలే మాలక్ష్యం... స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఓటు వేయమని సూచిస్తూ ప్రజల్లో ఆత్మవిశ్వాసం పెంపొందిస్తున్నారు. ఎస్పీ అమిత్ బర్దర్ ఆదేశాలతో డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు గ్రామసభలు నిర్వ హించి ప్రజల్ని సమాయత్తం చేస్తున్నారు. ప్రతీఒక్కరూ ఎన్నికల నియమ నిబంధనలు పాటించాలని కోరుతున్నారు.

మాదిగల పంతం... జగన్ అంతం..

కాలవకు మద్దతుగా విస్తృత ప్రచారం

విశాలాంధ్ర-డి.హీరేహాళ్ : మండలంలోని పులకుర్తి, మల్లికేతి, కాదలూరు, చెర్లోపల్లి, సోమలాపురం, దొడఘట్ట, మురడి, హనుమాపురం గ్రామాల్లో ఎస్సీ కాలనీలల్లో మాదిగ దండోరా నాయకులు విస్తృత ప్రచారం చేశారు. ఈ సందర్భంగా రాయదుర్గం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కాలవ శ్రీనివాసులు గెలుపే లక్ష్యంగా ఇంటింటికీ వెళ్లి టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కాలవ శ్రీనివాసులు సైకిల్ గుర్తుకు ఓటువేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని, చంద్రబాబునాయుడిని ముఖ్యమంత్రి చేయాలని ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు హరిగోపాల్ మాదిగ, తెలుగుదేశం పార్టీ ఎస్సీసెల్ జిల్లా అధికార ప్రతినిధి సత్యప్పగారి వెంకటేశులు, జిల్లా ప్రధాన కార్యదర్శి పీఆర్. పెన్నప్ప మాదిగ, తాలుకా అధ్యక్షులు ఎంసి.వన్నూరుస్వామి మాదిగ, డి.హీరేహాళ్ మండలం ఎస్సీసెల్ అధ్యక్షులు కాడు సిద్దప్ప, ఎంఆర్‌పిఎస్ మండల అధ్యక్షుడు శివరాజ్, ఓబుళాపురం తాయప్ప, బెళగల్లు బసవరాజు తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పల్లెనిద్రతో ప్రజలతో వీరాంజనేయుడు మమేకమై..

విశాలాంధ్ర-శింగనమల : ప్రజా సమస్యలు తెలుసుకుంటూ వైసీపీ అభ్యర్థి ఎం,వీరాంజనేయులు నార్పల మండలం బి. పప్పూరు గ్రామంలో మన ఊరికి మన వీరా కార్యక్రమంలో భాగంగా గడప గడపకు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం ఎస్సీ కాలనీలో పల్లె నిద్ర చేశారు. స్థానికులతో సమావేశం నిర్వహించారు. ఐదేళ్లలో జగనన్న అందించిన సంక్షేమ పాలనపై స్పందనను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను అడిగి తెలుసు కున్నారు. స్థానిక సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పేదల 2024లో కూడా గొప్ప సంక్షేమం ప్రజలకు అందించాలనే సంకల్పంతో సంక్షేమ పథకాలకు మెరుగులు దిద్దుతూ ఇంటి వద్దకే పాలన అందించబోతు న్నారన్నారు. మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకోవాలని ప్రజలను కోరారు.

టీడీపీలోకి ముస్లిం సోదరులు....

విశాలాంధ్ర-యాడికి: యాడికిలోని మౌలాలి వీధి, లాలాల వీధి, కుంట వీధికి చెందిన 20 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలోకి టిడిపి, జనసేన కన్వీనర్‌లు రుద్రమ నాయుడు, కోడి సునీల్‌కుమార్, ఛవ్వ గోపాల్ రెడ్డి, వేలూరు రంగయ్య ఆధ్వర్యంలో చేరారు. మైనారిటీ సభ్యులు చాంద్ భాష మాట్లాడుతూ ముస్లిం కమ్యూనిటీకీ రిజర్వేషన్లు తొలగిస్తారని అబద్ధపు ప్రచారాలు చేస్తూ తప్పు దోవ పట్టిస్తున్నారని, రంజాన్ తోఫా, దుల్ హన్ వంటి పథకాలు టీడీపీ జన సేన, బీజేపీ కూటమి విజయంతోనే సాధ్యం అన్నారు

ఆర్‌డీటీ సెట్‌కు దరఖాస్తు చేసుకోండి

విశాలాంధ్ర-రాప్తాడు: ఆర్డిటి ఆధ్వర్యంలో ఈనెల 19వ తారీఖున నిర్వహించనున్న ఆర్‌డిటి సెట్‌కు అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆర్డిటి ఎటిఎల్ మల్లికార్జున మంగళవారం తెలిపారు. రాప్తాడు, అనంతపురం రూరల్ మండల విద్యార్థులకు నేటి నుండి రాప్తాడు ఫీల్డ్ ఆఫీసులో దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. పదిలో 500 ఆపైన మార్కులు, సెంట్రల్ సిలబస్ విద్యార్థులు 420 ఆపైన మార్కులు వచ్చిన వారు అర్హులు.

ప్రజల జోలికి వస్తే తాటతీస్తా...

గుమ్మనూరు జయరాం..

విశాలాంధ్ర-పామిడి : పట్టణం రహమత్ ఫంక్షన్ హాల్‌లో భగీరథ ఉప్పర (సగర) ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యవెంకటశివుడు యాదవ్ గుంతకల్ నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి గుమ్మనూరు జయరాం హాజరయ్యారు. జయరాం మాట్లాడుతూ ఉప్పర సగర సోదరులు గతంలో ఎప్పుడూ లేనివిధంగా ఈ రోజు మీకు అండ అండగా మేమున్నాం అ ఇంత పెద్ద ఎత్తున సగర ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేయడం గర్వకారణంగా ఉంది.. అలాగే ఎమ్మెల్యే వెంకట్రామిరెడ్డికి చెబుతున్న రాజకీయంగా నువ్వు నేను శత్రువులం.. ఏదైనా సమస్య ఉంటే నువ్వు నేను తేల్చుకుందాం అంతేగానీ ప్రజల జోలికి వస్తే మీ తాట తీస్తామని హెచ్చరించారు. ఈ ఐదేళ్లలో టీడీపీ కుటుంబ సభ్యులను ఎన్నో రకాల ఇబ్బందులకు గురి చేశారు ఇక మీ దాదాగిరి చెల్లదు ఎందుకంటే గుమ్మనూరు జయరాం గుంతకల్లు నియోజకవర్గం ప్రజలకు అండగా ఉన్నాడు ఓటు అనే ఆయుధంతో ఎమ్మెల్యే వెంకట్రామిరెడ్డికి బుద్ధిచెప్పి ఇంటికి సాగనంపుదామని అని అన్నారు. కార్యక్రమంలో పత్తి హిమబిందు, బొల్లు శ్రీనివాస్‌రెడ్డి, ప్రభాకర్ చౌదరి, దాసరి లక్ష్మీకాంతమ్మ,లీలా మనోహర్, మండ్లశ్రీని వాసులు, రంగస్వామి యాదవ్, పాల్గొన్నారు.

టీడీపీలోకి వలసలు ...

విశాలాంధ్ర-రాయదుర్గం అర్బన్ : గుమ్మఘట్ట మండల కేంద్రంతో పాటు గొల్లపల్లి గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు తెలుగుదేశం పార్టీలోకి చేరారు. వారికి రాయదుర్గం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కాలువ శ్రీనివాసులు పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అందరూ కష్టపడి పని చేసి టీడీపీని అధికారంలోకి తేవాలని, నారా చంద్రబాబు నాయుడిని ముఖ్యమంత్రి చేసేందుకు సైనికుల్లా పనిచేయాలని సూచి చారు. కార్యక్రమంలో క్లస్టర్ కాలవ సన్నన్న, బేలోడు సంజీవ, వెంకటేష్, ఎస్సీ సెల్ మళ్లీ టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

మే డే దినోత్సవాన్ని జయప్రదం చేద్దాం

సీపీఐ కార్యదర్శి వేమయ్య యాదవ్

విశాలాంధ్ర-కదిరి: జిల్లా వ్యాప్తంగా 138వ కార్మిక దినోత్సవాన్ని విజయవంతం చేయాలని శ్రీ సత్యసాయి జిల్లా సిపిఐ కార్యదర్శి ఎం.వేమయ్య. యాదవ్ తెలిపారు. మంగళవారం ఆయన సీపీఐ పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ 1886 సంవత్సరం అమెరికాలోని చికాగో నగరంలో కార్మిక వర్గం 8 గంటల పని దినం కోసం పెద్ద ఎత్తున పోరాటం చేసి 8గంటల పని దినం సాధించిన రోజే మే డే అన్నారు. 138 సంవత్సరాలుగా సాధించుకున్న హక్కులు ఈ పది సంవత్సరాలలో కనుమరుగయ్యే విధంగా కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తోందని, కార్మికులు ఐక్యం కావాలని పిలుపునిచ్చారు. కష్టాలు, బాధలు, వేతన సమస్య, కనీస వేతనం సమస్యల పరిష్కారం కోసం ఉద్యోగ కార్మికులు ఎదురు చూస్తున్నారని తెలిపారు. దుకాణాల్లో 12 నుంచి 15 గంటలు పని చేస్తున్నారన్నా గత, ప్రస్తుత పాలకులు పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. ఈ ఎన్నికల కాలంలో మే డే.ని పెద్దఎత్తున నిర్వహించాలని సిపిఐ పిలుపునిచ్చిందని ఇందులో భాగంగానే మండల, పట్టణ ప్రాంతాలలో అన్ని రంగాలలోని సంఘాల నాయకులు పాల్గొని మే డే ను జయప్రదం చేయాలని తెలిపారు. ఈ ఎన్నికల యుద్ధం వైసీపీకి, టీడీపీ, జనసేనకీ మధ్య కాదని భారతీయ జనతా పార్టీకి ప్రజలకూ మధ్య జరిగే యుద్ధ మన్నారు. గత పదేళ్లుగా ఈ రాష్ట్రాన్ని పాలించిన ఈ పార్టీలు విభజన చట్టం లోని హామీలను అమలు చేయించుకోడానికి విశాఖ ఉక్కు ప్రైవేటుపరం కాకుండా ఆపడానికి నిరుద్యోగుల సమస్యలు కోసం కేంద్రంలోని మోడీ ప్రభుత్వాన్ని ఏనాడూ నిలదీయలేదన్నారు. జిల్లాలో కార్మికుల ఓట్లు కోసం పాలకులు ప్రాకులాడుతున్నరని ఏనాడు కార్మికు హక్కులు, వారి సమస్యలు పట్టించుకొని వారికి ఓటు అనే ఆయుధంతో సరైన గుణపాఠం చెప్పాలన్నారు. ఈ కార్మిక దినోత్సవాన్ని మండల కార్యదర్శులు, ఏఐటీయూసీ నాయకులు, ప్రజా సంఘాల నాయకులు వాడవాడలా నిర్వహించి విజయవంతం చేయాలని ఆయన కోరారు.

కాంగ్రెస్ పార్టీకి విశేష స్పందన

- కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి రంగన అశ్వర్థ నారాయణ

విశాలాంధ్ర-ధర్మవరం: కాంగ్రెస్ పార్టీతోనే రాష్ట్ర రాష్ట్ర ప్రజలకు న్యాయం జరుగుతుందని, కాంగ్రెస్ మేనిఫెస్టోకు ప్రజల నుండి తనకు విశేష స్పందన వస్తున్నదని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి రంగాన అశ్వర్థ నారాయణ అన్నారు. మంగళవారం ధర్మవరంలోని ఎర్ర గుంట నుండి ఎల్ వన్, ఎల్ టు, కేతిరెడ్డి కాలనీ, లయన్స్ క్లబ్ కంటి ఆసుపత్రి వరకు తమ ప్రచారాన్ని కొనసాగించారు. ఇంటింటికి తిరిగి కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. చిన్నా, పెద్దా వ్యాపారులకు కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి పనులను తెలుపుతూ, కర్ణాటక, తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారని, ఆంధ్రప్రదేశ్ లో కూడా కాంగ్రెస్ పార్టీకి రాష్ట్ర ప్రజలు ఆశీస్సులు అందజేస్తారన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన మేనిఫెస్టోను తప్పక అమలు చేసి తీరుతామని తెలిపారు. చేనేతకు జీఎస్టీని మినహాయింపు చేస్తామని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే సి ఏ ఏ, ఎన్ ఆర్సి, ఎన్ పిఆర్, యుసిసి చట్టాలను రద్దు చేస్తామని తెలిపారు. రైతు రుణమాఫీ రూ.2 లక్షల వరకు, రైతు పెట్టుబడి మీద 50 శాతం లాభంతో మద్దతు ధర, ఉపాధి హామీ కూలీకి రోజుకు కనీసం 400 రూపాయలు వేతనము, వృద్ధులకు, వితంతువులకు రూ.4,000 పెన్షన్, వికలాంగులకు రూ.6 వేల పెన్షన్ ఇవ్వబడుతుందని తెలిపారు. కేజీ నుండి పీజీ వరకు ఉచిత విద్య, ఇల్లు లేని వారికి ఐదు లక్షల రూపాయలతో ఇంటి నిర్మాణం, ప్రత్యేక హెూదా 10 సంవత్సరాలు గ్యారంటీతో తదితర పథకాలను వెనువెంటనే అమలు చేస్తామని చేనేత వ్యాపారులు కార్మికుల సంక్షేమానికి చేనేత బ్యాంకు ఏర్పాటు చేస్తామని, పట్టు ముడి సరుకు కొనుగోలుకు 40 శాతం రాయితీ ఇస్తామని, చేనేత ప్రాంతాలలో ప్రభుత్వ సహకారంతో ముడి సరుకు విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేస్తామని కర్ణాటక తమిళనాడు రాష్ట్రాలలో మాదిరిగా ఆంధ్ర సిల్క్ బోర్డును కూడా ఏర్పాటు చేస్తామని ఆత్మహత్యలు చేసుకున్న నేతలను తగిన ఆర్థిక సహాయంతో ఆదుకుంటామని తెలిపారు. ఓటుతోనే రాజ్యాంగాన్ని రక్షించుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు తాహీర్, నారాయణస్వామి, మునఫ్, జాఫర్, కరీం, సాయి, శంకర్, రాజు, మన్సూర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే సంక్షేమం ..

విశాలాంధ్ర-పెనుకొండ : మండల పరిధిలోని మునిమడుగు, గుట్టూరు, గ్రామాల్లో మంగళవారం పెనుకొండ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పాల సముద్రం నరసింహులు ఎన్నికల ప్రచారం చేపట్టారు. రాష్ట్రానికి ప్రత్యేక హెూదా కావాలంటే, పోలవరం పూర్తి కావాలంటే కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని కోరారు. విభజన హామీలు పూర్తిచేసి కేంద్రం నుంచి నిధులు తెచ్చి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కాంగ్రెస్ పార్టీ ముందుంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో బి బ్లాక్ ప్రెసిడెంట్ వెంకట్రాంరెడ్డి, రోద్దం కన్వీనర్ ప్రకాష్‌రెడ్డి, పెనుకొండ కన్వీనర్ నరహరి, సోమందేపల్లి మండల కన్వీనర్ గంగాధర్, పరిగి మండల కన్వీనర్ ఈశ్వరప్ప, నాయకులు టైలర్ బాబు, దస్తగిరి పాల్గొన్నారు.

తెలుగుదేశం పార్టీలో చేరికలు

విశాలాంధ్ర-ధర్మవరం: సార్వత్రిక ఎన్నికల్లో ఉమ్మడి అభ్యర్థి సత్య కుమార్ యాదవ్ నియోజకవర్గ సమస్యలను తెలుసుకొని, హామీ ఇస్తూ వందలాదిమంది కుటుంబాలు టీడీపీ, బీజేపీలో చేరుతున్నాయని పరిటాల శ్రీరాం తెలిపారు. మంగళవారం మల్లా కాలువ గ్రామానికి చెందిన రామ్మోహన్ రెడ్డి, నారాయణరెడ్డి, జనార్దన్ రెడ్డి, నాగిరెడ్డి, అశోక్ రెడ్డి, చెన్నకేశవరెడ్డి తదితర 25 కుటుంబాలు టీడీపీలో చేరాయి. సత్యకుమార్‌యాదవ్ గెలుపు కోసం ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని పరిటాల శ్రీరాం పిలుపునిచ్చారు.

దేశానికి బీజేపీ పార్టీ శ్రీరామరక్ష

విశాలాంధ్ర-ధర్మవరం: దేశానికి బీజేపీ పార్టీ శ్రీ రామరక్ష అని బీజేపీ నేషనల్ కౌన్సిల్ మెంబర్ అంబటి సతీష్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం ధర్మవరం పి.ఆర్.టి సర్కిల్‌లో బీజేపీ అభ్యర్థి వై.సత్యకుమార్‌ను గెలిపించాలని కోరుతూ ఎన్నికల ప్రచారం చేపట్టారు. బీజేపీ అధికారంలోకి వస్తే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని, నియోజకవర్గంలో సత్యకుమార్ యాదవును గెలిపిస్తే అభివృద్ధి బాటలో నడవడం ఖాయమని ఇప్పటికే ఎన్నో నియోజకవర్గ సమస్యలను తెలుసుకోవడం జరిగిందని, మే 4వ తేదీన జౌళి శాఖ మంత్రి రానున్నట్లు తెలిపారు. ఈ ప్రచారంలో బీజేపీ నేతలు జింకా చంద్రశేఖర్, శంకర చంద్రశేఖర్,సిద్దయ్య గుట్ట హరి, నాగేంద్ర గౌడ్, వీరయ్య, శంకర మల్లి,బిల్లే నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మైసూర్ రాతి విగ్రహాల వితరణ

విశాలాంధ్ర-ధర్మవరం : తిరుమల తిరుపతి దేవస్థానం వారు ధార్మిక ఆధ్యాత్మిక ఉపన్యాసాలతో పాటు దేశవ్యాప్తంగా ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, అందులో భాగంగా దేవాలయాలకు రాయితీతో మైక్‌సెట్‌లు, రాతి, పంచలోహ విగ్రహాలు పంపిణీ చేస్తున్నట్లు టీటీడీ ధర్మప్రచారకులు నక్కల వెంకటేష్ తెలిపారు. మంగళవారం మాట్లాడుతూ ఎస్సీ ప్రాంతాలకు 90 శాతం, బీసీ ప్రాంతాలకు 50 శాతం రాయితీపై మైసూరు రాతి పంచలోహ విగ్రహాలను అందజేస్తున్నామని, ఇందులో భాగంగా పట్టణంలోని బాబు జగ్జీవన్‌రావు నగర్ ఎస్సీ ప్రాంతంలో 90 శాతస్త్ర రాయితీపై దేవాలయానికి మైక్‌సెట్ ఇచ్చామన్నారు. పూజారి రఘుపతి పూజలు నిర్వహించి మైక్‌సెట్‌ను ప్రారంభించారు. దేవాలయ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో నాగరాజు, కేత వెంకటరాముడు, రఘు రామయ్య, రాము,సుధాకర్, జయరాముడు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

మే 5లోపు పింఛన్‌దారులకు నగదు

మున్సిపల్ కమిషనర్ రామ్ కుమార్

విశాలాంధ్ర-ధర్మవరం : మే 5వ తేదీలోపల పెన్షన్‌దారులకు పెన్షన్ తప్పక పంపిణీ చేస్తామని, పట్టణంలో 18,588 మంది పింఛన్ దారులు ఉన్నారని, వారందరికీ 5 కోట్ల 60 లక్షల 63 వేల రూపాయలు పంపిణీ చేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ రామ్‌కుమార్ తెలిపారు. మంగళవారం మాట్లాడుతూ పెన్షన్‌దారులు సచివాలయాలకు కానీ ఇతర కార్యాలయాలకు కానీ పెన్షన్ కొరకు వెళ్లాల్సిన అవసరం లేదని, మే, జూన్ నెలలకు సంబంధించిన పింఛన్ సొమ్ము ఆధార్ అనుసంధానమైన ఎన్పిసిఐ- ద్వారా నిర్ధారించబడిన ఖాతాలకు జమ చేయపడుతుందని తెలిపారు. బ్యాంకు ఖాతాకు ఆధార్ అనుసంధానం కాని పెన్షన్‌దారులకు, విభిన్న ప్రతిభావంతులు, మంచానికి పరిమితమైన వారికి, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు, నడవలేని స్థితిలో ఉన్నవారికి, వారి ఇంటి వద్దనే పెన్షను సిబ్బంది ద్వారా ఇవ్వబడునని తెలిపారు. మే 1వ తేదీ ఉదయం 8:30 గంటల నుండి పింఛన్‌దారులకు ఖాతాల్లో పింఛన్ జమ అవుతుందన్నారు. మే 5వ తేదీ వరకు ప్రతీ కేటగిరి పింఛన్‌దారులకు కూడా ఇంటింటకీ పెన్షన్ అందిస్తామన్నారు. ఏ కారణం చేతనైనా మే 1వ తేదీ పింఛన్ సొమ్ము అందకుంటే 3వ తేదీ ఇంటి వద్దే పింఛన్ పంపిణీ చేస్తామని తెలిపారు.

ఆకట్టుకున్న నాట్య వేడుకలు

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని బ్రాహ్మణ వీధిలో గల శ్రీ లలిత నాట్య కళా నికేతన్‌లో నాట్య ఆచార్యులు బాబు బాలాజీ, కమలా బాలాజీ, రామ లాలిత్య ఆధ్వర్యంలో అంతర్జాతీయ నృత్య దినోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. బాబు బాలాజీ, కమలా బాలాజీ మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా శ్రీ లలిత నాట్య కళానికేతన్ వారు వందల మందికి కూచిపూడి, భరతనాట్యం నేర్పించి భారతీయ సంస్కృతి కళలను రాష్ట్రవ్యాప్తంగా విస్తరింప చేయాలన్న లక్ష్యంతో తాము ముందుకు వెళ్తున్నామని తెలిపారు. భారతీయ సాంప్రదాయ ఆచార వ్యవహారాలను అందరూ పాటించే విధంగా ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, హిందూ సాంప్రదాయ ప్రాధాన్యతకు కూడా విశేష గుర్తింపు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. 40 మంది విద్యార్థులచే పలు నాట్య ప్రదర్శనలు ఇవ్వడం జరిగిందని తెలిపారు. నాట్యం, నాట్య కళాకారులు, భారతీయ నాట్యాలు గురించి పిల్లలకు పూర్తి దశలో వివరణ ఇవ్వడం జరిగిందని తెలిపారు.

4న ఉచిత బాస్కెట్ బాల్ వేసవి శిక్షణ శిబిరం ....

విశాలాంధ్ర-ధర్మవరం : పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో మే 4వ తేదీ నుండి నెల రోజులపాటు ఉచిత బాస్కెట్‌బాట్ వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి, అధ్యక్షులు మేడాపురం రామిరెడ్డి, కార్యదర్శి వాయల్పాడు హిదాయతుల్ల,కోచ్ సంజయ్ తెలిపారు. ఉదయం 6 గంటల నుండి 8 గంటల వరకు, సాయంత్రం నాలుగున్నర గంటల నుండి 6:30 గంటల వరకు శిక్షణ ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 9030944717కు గాని 939170032కు గాని సంప్రదించవచ్చునని తెలిపారు.

మేడేను విజయవంతం చేయండి..

విశాలాంధ్ర-పుట్టపర్తి : 138వ మే డేను జిల్లా వ్యాప్తంగా జయప్రదం చేయలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన ప్రకటన విడుదల చేస్తూ చికాగో నగరంలో 18 గంటల పనిదినాన్ని వ్యతిరేకిస్తూ 8 గంటల పనిదినం కోసం కార్మికుల పోరాట ఫలితంగా ఏర్పడినదే మెడే అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు.. పోరాడి తెచ్చుకున్న చట్టాలను నిర్వీర్యం చేస్తున్నాయన్నారు. నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత 44చట్టాలను రద్దు చేసి 4 కోడ్సుగా విభజించి కార్మికులకు అన్యాయం చేస్తున్నారన్నారు. కార్మిక చట్టాలను కాపాడుకోవడానికి ప్రభుత్వాలపై మరో పోరాటానికి కార్మికులు ఐక్యం కావాలని తెలిపారు.

మంత్రి ఉషశ్రీ అవినీతిలో పెద్ద అనకొండ

విశాలాంధ్ర-పెనుకొండ: ఉషశ్రీ అవినీతిలో పెద్ద అనకొండ.. ఆమె అవినీతిపై పుస్తకం రాస్తే పెద్ద గ్రంథమే అవుతుందని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సవితమ్మ అన్నారు. మంగళవారం స్థానిక విలేకరులతో మంత్రి ఉషశ్రీ చేసిన ఆరోపణలపై మాట్లాడుతూ ఉషశ్రీ అఫిడవిట్లో 2019లో లేని ఇన్ కమ్ టాక్స్ ఈ ఎన్నికల్లో ఎలా వచ్చిందనీ ఎమ్మెల్యే, మంత్రి అయిన వెంటనే వేల కోట్లు దోచుకుందని ఆరోపించారు. వేల మందికి అన్నం పెట్టిన ఘనత నాది.. మీది పట్టెడన్నం పెట్టి భూములు లాక్కున్న సంస్కృతి అని ఎద్దేవా చేశారు. నీవు నా మీద బురద చల్లాలని చూస్తే పెనుకొండ ప్రజలు నామీద పూల వర్షం కురిపిస్తున్నారని పేర్కొన్నారు. ఉషమ్మకు ఓటమి భయం పుట్టుకుని చంటి పిల్లలా మాట్లాడుతున్నదన్నారు. సవితమ్మ అంటే ఈ నియోజకవర్గ ప్రజలకు బాగా తెలుసు,... నన్ను పేరుతో కాదు అన్నపూర్ణమ్మ అని పిలుస్తారని తెలిపారు. కళ్యాణదుర్గంలో ఉషశ్రీ అవినీతి అక్రమాలు, భూకబ్జాలు చేసిన సంగతి పెనుకొండ ప్రజలకు తెలిసిపోయిందని, ఏమి చేయాలో దిక్కుతోచక పెనుకొండ ఎమ్మెల్యే అభ్యర్థిగా వచ్చారన్నారు. మీ అవినీతి అక్రమాలు రాస్తే పెద్ద బుక్కులే అవుతాయని.. అయినా నాకు అంత సమయం లేదు నేను ప్రజాక్షేత్రంలోనే తేల్చుకునేందుకు సిద్ధంగా ఉన్నానని పేర్కొన్నారు. ప్రశ్నించినందుకే కదా కళ్యాణదుర్గంలో మీ నాయకులపైనే కేసులు పెట్టించి జైలు పాలు చేయించిన నీచ చరిత్ర నీది కాదా అని ఎద్దేవా చేశారు.

మరోసారి జగన్ సీఎం కావాలి

విశాలాంధ్ర-రొళ్ల : రాష్ట్రంలో సంక్షేమ పాలన కావాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్మోహన్‌రెడ్డిని కావలసిన అవసరం ఎంతైనా ఉందని మడకశిర వైసీపీ అభ్యర్థి ఈరలక్కప్పను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఎంపిపి కవిత రాష్ట్ర కుంచిటిగా ఒక్కలిగా కార్పొరేషన్ డైరెక్టర్ నేత్రావతి సర్పంచ్ లక్ష్మమ్మ ప్రజలను కోరారు. కాకి,బ్యాడగేరి లక్కప్పనపల్లి,కాకి గొల్లహట్టి గ్రామాలలో మంగళవారం గడప గడపకు వెళ్లి వైసీపీ మెనుపేస్టోని ప్రజలకు వివరించారు. హిందూపురం ఎంపీ అభ్యర్థి బోయ శాంతమ్మను మడకశిర ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్పను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రచారం చేశారు.పేదలు మరింత అభివృద్ధి చెందాలంటే జగన్మోహన్ రెడ్డి మరోసారి సీఎం కావాలన్నారు. టీడీపీ చెప్పే అబద్ధపు హామీలను నమ్మి మోసపోవద్దన్నారు. వైస్ ఎంపీపీ రత్తమ్మ పాల్గొన్నారు.

భార్య పుట్టింటికి వెళ్లిందని... ఆత్మహత్య

విశాలాంధ్ర-గోరంట్ల: మద్యానికి బానిసై వేధిస్తుండగా భరించలేక భార్య, పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్లడంతో భర్త మద్యం మత్తులో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు సిఐ సుబ్బరాయుడు తెలిపారు. గోరంట్ల రామ శంకర కాలనీలో కాపురం ఉంటున్న మన్సూర్ భాష(31) కూలి పనులకు వెళ్తూ జీవనం సాగిస్తున్నాడు. మద్యానికి బానిసైన మన్సూర్ భాష వేధింపులు తాళలేక భార్య పుట్టింటికి వెళ్తుండడంతో సోమవారం రాత్రి తన తల్లిదండ్రులకు ఫోన్‌చేసి తాను చనిపోతున్నానని, ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తండ్రి అల్లాబకష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

ఏపీలో టీడీపీ ఉమ్మడి కూటమి అధికారం ఖాయం

... భగవాన్ సత్యసాయి బాబా ఆశీస్సులతో పుట్టపర్తి అభివృద్ధే నా ధ్యేయం

... కూటమి అభ్యర్థి పల్లె సింధూర రెడ్డి

విశాలాంధ్ర-బుక్కపట్నం: సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీకి ఓటుతో బుద్ధి చెప్పాలనీ పుట్టపర్తి నియోజకవర్గ టీడీపీ ఉమ్మడి కూటమి అభ్యర్థి పల్లె సింధూర రెడ్డి ప్రజలను అభ్యర్థించారు. బుక్కపట్నం మండలం సిద్దరాంపురం గ్రామపంచాయతీ పరిధిలోని గ్రామాల్లో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ,వైసిపి ప్రభుత్వ అరాచకాలకు ఓటుతో సమాధానం చెప్పాలంటూ ప్రజలకు పిలుపునిచ్చారు. పుట్టపర్తి నియోజకవర్గ అభివృద్దే ధ్యేయంగా పనిచేస్తామని పేర్కొన్నారు. భగవాన సత్యసాయి బాబా ఆశీస్సులతో పుట్టపర్తి గడ్డపై ఎలాంటి అవినీతికి తావు లేకుండా సేవ చేస్తానని మాటఇచ్చారు. భవిష్యత్తులో నియోజకవర్గానికి అంతర్జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు తీసుకొస్తానని పేర్కొన్నారు. పుట్టపర్తి నియోజకవర్గంలో వైసిపి ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి సొంత మండలాన్ని కూడా పూర్తిగా గాలికి వదిలేశారు. స్వంత స్వలాభం కోసమే పనిచేశారని పేర్కొన్నారు. ఈలాంటి ఎమ్మెల్యే మళ్ళీ పుట్టపర్తి నియోజకవర్గానికి గెలిపిస్తే పుట్టపర్తి ని పూర్తిగా అమ్మేస్తాడని ప్రజలు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఎన్‌వి మూర్తి, మండల కన్వీనర్ మలిరెడ్డి, నాయకులు బొట్టు కిష్టప్ప, అప్పస్వామి, మాజీ ఎంపీపీ బాలు, గంగాధర్, కేశవ నాయుడు పాల్గొన్నారు.

చంద్రబాబు మోసపూరిత హామీలపై ఆలోచన చేయాలి

వైకాపా ఎమ్మెల్యే అభ్యర్థి బి.ఎస్ మక్బూల్

విశాలాంధ్ర-కదిరి : అధికారం కోసం చంద్రబాబు నాయుడు ఇస్తున్న మోసపూరిత హామీలపై ప్రజలు ఆలోచన చేయాలని వైకాపా ఎమ్మెల్యే అభ్యర్థి బి.ఎస్ మక్బూల్ తెలిపారు. మంగళవారం నల్లచెరువు మండల పరిధిలోని తలమర్ల వాండ్లపల్లి, తవలంమర్రి, పంతుల చెరువు పంచాయతీలలో స్థానిక నాయకులతో కలిసి గడప గడపకు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నిరుపేదలకు మంచి చేయాలనే ఆలోచనతో ఇచ్చిన హామీలను నిలబెట్టుకునే జగనన్నకు, మేనిఫెస్టోని మాయం చేసే చంద్రబాబుకు మధ్య వ్యత్యాసాన్ని ప్రజలు గమనించాలన్నారు. సూపర్ సిక్స్‌తో మొదలైన మేనిఫెస్టో సూపర్ 24కు చేర్చి మరోసారి ప్రజలను మోసం చేయడానికి రాష్ట్ర బడ్జెట్‌పై కనీస అవగాహన లేకుండా అధికార దాహంతో అన్నీ ఉచితాలంటూ ప్రచారం చేస్తున్నారన్నారని గుర్తుంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు డాక్టర్ బత్తల వెంకటరమణ, లీగల్ సెల్ జోనల్ ఇన్చార్జ్ లోకేశ్వర్ రెడ్డి, మాజీ టెంపుల్ చైర్మన్ గోపాలకృష్ణ, జెడ్పీటీసీ అనితవిశ్వనాథరెడ్డి, ఎంపీటీసీ మాధవిలత, పాలఏకరి సంఘం డైరెక్టర్ దశరథనాయుడు, సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి మండెం రవికుమార్ రెడ్డి పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధి జరగాలంటే టీడీపీతోనే సాధ్యం

- టీడీపీ ఉమ్మడి కూటమి అభ్యర్థి పల్లె సింధూర రెడ్డి

విశాలాంధ్ర-పుట్టపర్తి : శ్రీ సత్య సాయి జిల్లా అభివృద్ధి జరగాలంటే టీడీపీతోనే సాధ్యమని పుట్టపర్తి నియోజకవర్గ టీడీపీ ఉమ్మడి కూటమి అభ్యర్థి పల్లె సింధూర రెడ్డి ప్రజలను అభ్యర్థించారు. మంగళవారం గోకులంలో పుట్టపర్తి నియోజకవర్గ కూటమి అభ్యర్థి పల్లె సింధూరరెడ్డి ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ అరాచకాలకు ఓటుతో సమాధానం చెప్పాలంటూ ప్రజలకు పిలుపునిచ్చారు. పుట్టపర్తి నియోజకవర్గ అభివృద్దే ధ్యేయంగా పనిచేస్తామని పేర్కొన్నారు. భగవాన్ శ్రీ సత్యసాయి బాబా ఆశీస్సులతో పుట్టపర్తి గడ్డ పై ఎలాంటి అవినీతికి తావు లేకుండా సేవ చేస్తానని మాట ఇచ్చారు. భవిష్యత్తులో నియోజకవర్గానికి అంతర్జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు తీసుకొస్తానని పేర్కొన్నారు. పుట్టపర్తి నియోజకవర్గంలో వైసిపి ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి సొంత మండలాన్ని కూడా పూర్తిగా గాలికి వదిలేశారు. స్వంత స్వలాభం కోసమే పనిచేశారు కానీ ప్రజల సమస్యల పరిష్కారం కోసం పనిచేయలేదని పేర్కొన్నారు. ఈలాంటి ఎమ్మెల్యే మళ్ళీ పుట్టపర్తి నియోజకవర్గానికి గెలిపిస్తే పుట్టపర్తి నీ పూర్తిగా అమ్మేస్తాడని ప్రజలు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని కోరారు.అందుకే టీడీపీ సైకిల్ గుర్తుకు ఓటు వేసి వేయించి తెలుగుదేశం పార్టీని భాజీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ కన్వీనర్ రామాంజనేయులు,కౌన్సిలర్ వెంకటరమణమ్మ, టిడిపి రాష్ట్ర మైనారిటీ కార్యదర్శి మహమ్మద్ రఫీ, మాజీ కౌన్సిలర్లు సుభాషిని, షకీలా, దిల్షాద్ షేక్, మాజీ చైర్మన్ బెస్త చలపతి, లక్ష్మీపతి, రాజా, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ గెలుపునకు కళాజాత బృందంతో అవగాహన ..

విశాలాంధ్ర-అగళి : తెలుగుదేశం పార్టీని గెలిపించాలని కోరుతూ మంగళవారం కళాజాత బృందంతో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చంద్రబాబు ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలను కళాజాత బృందంతో చక్కగా అవగాహన కల్పించారు. తల్లివందనం ద్వారా కుటుంబంలో ఎంత మంది పిల్లలు చదువుతున్న అంత మందికి 15 వేలు చొప్పున మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితం, ప్రతి రైతుకు ఏడాదికి 20 వేలు రూపాయలు గృహలక్ష్మి పథకం కింద 18 సంవత్సరాలుపైబడి 60 సంవత్సరాలు వరకు రూ.1500లు మహిళలకు బస్‌లో ఉచిత ప్రయాణం తదితర పథకాలను అమలు అవుతాయని తెలిపారు.

జగన్ ఈర్ష్య పడుతున్నారు..

- కందికుంట వెంకట ప్రసాద్

విశాలాంధ్ర-కదిరి: చంద్రబాబు నాయుడుకు వచ్చే ప్రజాదరణ చూసి సీఎం జగన్ మోహనరెడ్డి ఈర్ష్య పడుతున్నారని టీడీపీ, జనసేన, బిజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకట ప్రసాద్ తెలిపారు. ఎవరెన్ని కుట్రలు చేసిన వచ్చేది ఎన్డీఏ కూటమే అన్నారు. మంగళవారం నల్లచెరువు మేజర్ పంచాయతీ, పట్టణంలో పలు ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం జోరు పెంచారు. దారు సలాం ఫంక్షన్ హాల్లో తాలూకా పరిధిలోని కార్పెంటర్లతో ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏపీలో సంక్షేమ పాలన సాగాలంటే సీఎంగా చంద్రబాబు అవసరమని పేర్కొన్నారు. ఎన్ని కుట్రలు కుతంత్రాలు చేసిన చంద్రబాబు నాయుడును సీఎంగా చేసుకోవడానికి ప్రజలంతా సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయ కులు వాల్మీకి పవన్ కుమార్ రెడ్డి బహవుద్దీన్, అల్లా ముస్తఫా, మహబూబ్ బాష పాల్గొన్నారు.

గోరంట్లలో భారీగా మద్యం స్వాధీనం

- 40 బాక్సుల మద్యం, రెండు కార్లు స్వాధీనం

- ఒకరు అరెస్టు, మరొకరు పరారీ...

విశాలాంధ్ర-గోరంట్ల : పాల సముద్రం వదల బెంగళూరు-హైదరాబాద్ జాతీయ రహదారిలో మంగళవారం భారీగా మద్యం స్వాధీనం చేసుకొని రెండు కార్లు సీజ్ చేసినట్లు సిఐ సుబ్బరాయుడు తెలిపారు. ఎస్పీ ఎస్‌వి మాధవరెడ్డి ఆదేశాల మేరకు పెనుకొండ డీఎస్పీ బాజీ జాన్ సైదా పర్యవేక్షణలో.. సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా పాలసముద్రం క్రాస్‌లోని జాతీయ రహదారిలో మంగళవారం ఉదయం 10 గంటల సమయంలో వాహనాలు తనిఖీ చేపట్టగా బెంగళూరు వైపు నుండి బోయ మాధవ (31) తండ్రి బోయ రామాంజనేయులు రుద్రంపేట అనంతపురం చెందిన ఇతిహాస్కారులో కర్ణాటక రాష్ట్రం నుండి హైవార్డ్స్ చీర్స్ విస్కీ 20 బాక్సులలో ఒక్కొక్క అట్ట బాక్సులో 96 90 ఎం.ఎల్ గల 1920 మద్యం పెట్టరా ప్యాకెట్లు, పామిడి మండలం ఎద్దులపల్లి చెందిన శేఖర్ టాటా ఇండిగో రెండు కార్లలో కర్ణాటక రాష్ట్రానికి చెందిన 21 బాక్సులలో 1920 మద్యం టెట్రా ప్యాకెట్లను తరలిస్తుండగా పట్టుకొని బోయ మాధవన అరెస్టు చేశారు. పామిడి మండలం ఎద్దులపల్లి కి చెందిన శేఖర్ కారును ఆపి తప్పించుకొని పారిపోయినట్టు తెలిపారు. రెండు కార్లను, మద్యంను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు

బొడ్రాయికి ప్రత్యేక పూజలు..

విశాలాంధ్ర-ధర్మవరం : పట్టణంలోని అంజుమాన సర్కిల్ వద్ద గల బొడ్రాయికి (శీతల దేవి) వాసవి భజన మండలి అధ్యక్షులు దేవతా కృష్ణమూర్తి, కార్యదర్శి కోటి శ్రీవత్స ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చకులు చంద్రశేఖర్ శర్మ వేదమంత్రాల నడుమ నిర్వహించారు. వాసవి భజన మండలి కమిటీతో పాటు భక్తులు 108 బిందెలతో బొడ్రాయికి నీరు పోశారు. దేవతాకృష్ణమూర్తి కోటి శ్రీవత్స మాట్లా డుతూ రాష్ట్రంలో మంచి వర్షాలు కురవాలని, పాడి పంటలతో రైతులు సుఖశాంతులతో ఉండాలని సీతరా దేవికి పూజలు నిర్వహించామని చెప్పారు. కార్యక్రమంలో లక్ష్మణ్, గూడూరు శ్రీనివాసులు, జయంతి ప్రసాద్, దేవత బాబు, కిశోర్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

విశాలాంధ్ర అనంతపురం/సత్యసాయి
www.visalaandra.com
కర్నూలు, బుధవారం 1, మే 2024

పేదల వ్యతిరేక పార్టీ టీడీపీని ఓడించండి

వైసీపీ అభ్యర్థి విశ్వేశ్వర రెడ్డిని గెలిపించండి

విశాలాంధ్ర–ఉరవకొండ: పేద ప్రజల వ్యతిరేక పార్టీ టీడీపీని ఓడించి వైసీపీ ప్రభుత్వాన్ని ఉరవకొండలో వైసీపీ అభ్యర్థి వై.విశ్వేశ్వర రెడ్డిని గెలిపించాలని మరోసారి జగన్‌ను ముఖ్యమంత్రి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని వైసీపీ పార్టీ రాష్ట్ర యువనేత వై.ప్రణయ్ రెడ్డి అన్నారు. మంగళవారం ఉరవకొండ పట్టణంలోని 7వ వార్డులో ఎన్నికల ప్రచారం చేపట్టారు. పేద బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి, సంక్షేమం కోసం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎనలేని కృషి చేశారని లబ్ధిదారులు అందరు కూడా జగన్మోహన్ రెడ్డి గెలుపునకు స్టార్ క్యాంపియన్లుగా పని చేయాలన్నారు. ఉరవకొండ నియోజకవర్గంలో నిత్యం ప్రజల కోసం పనిచేస్తూ వారు అభివృద్ధి కోసం కృషి చేస్తున్న విశ్వేశ్వరరెడ్డిని గెలిపించాలని తెలిపారు.

25 పథకాలతో ప్రజల ముందుకు వస్తున్నాం

-రూ.5వేల కోట్లతో రాప్తాడును అభివృద్ధి చేశా...
-మోసాలు, అరాచక పాలనకు ముగింపు పలుకుదాం
-ఎన్నికల ప్రచారంలో మాజీ మంత్రి పరిటాల సునీత

ఎన్నికల ప్రచారం చేస్తున్న పరిటాల సునీత..

విశాలాంధ్ర–రాప్తాడు: రాష్ట్రంలో అన్ని వర్గాల అభ్యున్నతికి దోహదపడేలా టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి 25పథకాలతో ప్రజల ముందుకు వస్తోందని మాజీ మంత్రి పరిటాల సునీత అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం ఆత్మకూరు మండలం ముట్టాల, గొరిదిండ్ల తండా, గొరిదిండ్ల, సిద్దరాంపురం, పి.యాలేరు, పంపనూరు తండా, పంపనూరు, వద్దుపల్లి, తలుపూరు గ్రామాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామాల్లో రోడ్ షో తోపాటు ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ గ్రామాల్లో ఎంత అభివృద్ధి చేశానన్నది వివరించారు. అలాగే ఈ ఐదేళ్లలో గ్రామాల్లో ఎలాంటి సమస్యలు ఉన్నాయన్నది ప్రస్తావించారు. తనకు ఓటు వేసినా వేయకపోయినా.. మెజార్టీలు తక్కువగా వచ్చినా ఏ రోజు తారతమ్యాలు చూడలేదన్నారు. నియోజకవర్గంలో రూ.5వేల కోట్లతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేశానన్నారు. ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి కనీసం ఇందులో 10వ వంతైనా చేశారా అని నిలదీశారు. ఇలాంటి నాయకున్ని గెలిపించుకుని మీరు ఏం సాధించారని వైసీపీ నేతల్ని ప్రశ్నించారు. కాలువల కోసం భూములు కోల్పోయిన రైతులందరికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. తాము గెలవగానే 25 పథకాలు కచ్చితంగా అమలు చేస్తామన్నారు. బాబుసూపర్ సిక్స్ పథకాలతో పాటు బీజేపీ, జనసేన తో కలసి మరిన్ని పథకాలు మీకు ఇస్తామన్నారు. ముందుగా చంద్రబాబు సీఎం అయ్యాక మెగా డీఎస్సీపై తొలి సంతకం చేస్తారన్నారు. జగన్ ప్రభుత్వంలో విపరీతంగా విద్యుత్ ఛార్జీలు పెంచారని.. కానీ టీడీపీ వచ్చాక కరెంటు ఛార్జీలు ఒక్క రూపాయి కూడా పెంచమన్నారు. టిడిపి మేనిఫెస్టో పథకాలు గురించి ఒ?కసారి ఆలోచించి.. టీడీపీకి ఓటు వేయాలని కోరారు.

పకడ్బందీగా బ్యాలెట్ యూనిట్ల ర్యాండమైజేషన్

జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి వినోద్ కుమార్

విశాలాంధ్ర–అనంతపురం వైద్యం: అనంతపురం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో మంగళవారం సాధారణ ఎన్నికలు - 2024లో భాగంగా తాడిపత్రి అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి బ్యాలెట్ యూనిట్ల ర్యాండమైజేషన్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ వినోద్ కుమార్.వి (ఐఏఎస్) చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ కమిషనర్ మేఘ స్వరూప్, డిఆర్ఓ జి.రామకృష్ణారెడ్డి, అసిస్టెంట్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈవీఎంల, వివి ప్యాట్స్ ల ర్యాండమైజేషన్ ప్రక్రియను ఇప్పటికే నిర్వహించడం జరిగిందని, తాడిపత్రి అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి 18 మంది అభ్యర్థులు ఎన్నికల్లో పోటీ చేస్తుండగా, అదనంగా మరో బ్యాలెట్ యూనిట్ అవసరమయ్యాయన్నారు. తాడిపత్రి అసెంబ్లీ నియోజకవర్గంలో సాధారణ ఎన్నికల కోసం 274 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తుండగా, ఇప్పటికే 331 బ్యాలెట్ యూనిట్లను కేటాయించడం జరిగిందని, ఎన్నికల కమీషన్ నిబంధనల మేరకు 16 మంది కంటే ఎక్కువ మంది అభ్యర్థులు పోటీ చేస్తుండడంతో తాడిపత్రి అసెంబ్లీ నియోజకవర్గానికి 20 శాతం అదనంగా 329 బ్యాలెట్ యూనిట్లను కేటాయిస్తూ మంగళవారం ర్యాండమైజేషన్ ప్రక్రియను నిర్వహించామన్నారు. మొత్తం తాడిపత్రి అసెంబ్లీ నియోజకవర్గానికి 660 బ్యాలెట్ యూనిట్లను కేటాయించామని, ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ప్రక్రియను నిర్వహించడం జరిగింది. ఈవీఎంల ర్యాండమైజేషన్ ప్రక్రియపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం జిల్లా ఎన్నికల అధికారి బ్యాలెట్ యూనిట్ల ర్యాండమైజేషన్ ప్రక్రియ సజావుగా పూర్తైందని తెలిపారు.

సంక్షేమ సారథిని గెలిపిద్దాం

విశాలాంధ్ర, పెనుకొండ : పెనుకొండ నగర పంచాయతీ పరిధిలోని 11వ వార్డులో 15వ వార్డు నందు రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి పేనుకొండ నియోజకవర్గం వైసీపీ అభ్యర్థి ఉష్రశ్రీ చరణ్ తరఫున ఆమె సోదరి జోత్స్న ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. 11వ వార్డులో తోటిగేరే, బ్రాహ్మణ వీధిలో ఇంటింటా వైసీపీ నాయకులతో కలిసి జగన్మోహన్‌రెడ్డి చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు చేయబోయే సంక్షేమ కార్యక్రమాలు గురించి ఓటర్లకు వివరించారు. అక్క ఉష్రశ్రీ చరణ్‌ని హిందూపురం పార్లమెంట్ అభ్యర్థి శాంతమ్మను ఫ్యాన్ గుర్తుకు వేసి వేయించి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ నాగరత్నమ్మ గణేష్ రఘునాథ్ రెడ్డి, చైర్మన్ ఉమర్ ఫరూక్, వైస్ చైర్మన్ లు సునీల్, వైశాలి జయశంకర్ రెడ్డి, కౌన్సిలర్లు సుధాకర్ రెడ్డి, కన్వీనర్ నరసింహ, కౌన్సిలర్లు శేషాద్రి, తయుబ్, కిరణ్, బాబు, కొండల రాయు డు శంకర్ రెడ్డి పాల్గొన్నారు.

నాయి బ్రాహ్మణుల సంక్షేమం చంద్రన్నతోనే సాధ్యం

విశాలాంధ్ర–శింగనమల : నాయి బ్రాహ్మణుల సంక్షేమం చంద్ర బాబుతోనే సాధ్యమని బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎం.ఆది నారాయణ మంగళవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఈరోజు ప్రకటించిన తెలుగుదేశం పార్టీ బిజెపి జనసేన ఉమ్మడి మేనిఫెస్టోలో దేవాలయాల్లో పనిచేసేనాయి బ్రాహ్మణులకు రూ.25 వేల గౌరవ వేతనం, అలాగే హెయిర్ సెలూన్ షాపులకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్తు రూ.5 వేల కోట్లతో ఆదరణ పథకం ద్వారా వృత్తి పరికరాలకు ఆర్థిక సహాయం, అలాగే బీసీలకు 50 సంవత్సరాలకే రూ.4 వేల పింఛన్ అనేక సంక్షేమ కార్యక్రమాలు గతంలో కూడా టీడీపీతోనే సాధ్యమైందని, అలాగే బీసీ కులాల్లో రాజకీయంగా పోటీ చేయలేని కులాలకు కో ఆప్షన్ సభ్యులుగా అవకాశం కల్పించే విధంగా రూపుదిద్దిన మేనిఫెస్టోను ఈరోజు విడుదల చేసిన నారా చంద్రబాబు నాయుడికి పవన్ కళ్యాణ్‌కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

పింఛన్ లబ్ధిదారులకు నగదు బదిలీ...

విశాలాంధ్ర–డి.హీరేహాళ్ : మండలంలో మే నెలకు సంబందించిన పెన్షన్ 5234 లబ్దిదారులకు మంజూరైందని, వారికి మొత్తం రూ.1,55,58,000 వాటిలో 4007పెన్షన్లు మొత్తం రూ.1,39,70,000 వారి వారి బ్యాంకు ఖాతాకు జమ అయ్యాయని ఎంపిడిఓ రఘునాథ్ తెలిపారు. కాబడినవి అని మిగిలిన 1227పెన్షన్ మొత్తం రూ.35,37,000 సచివాలయ సిబ్బంది ద్వారా ఇంటింటికి వెళ్లి పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు.

టీడీపీ అభ్యర్థి రాజును గెలిపించండి

విశాలాంధ్ర–రొళ్ల: సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎమ్.ఎస్ రాజును సైకిల్ గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆ పార్టీ మండలాధ్యక్షులు దాసిరెడ్డి మండల ప్రధాన కార్యదర్శి జి.కె.ఈరన్న కోరారు. మంగళవారం మండల పరిధిలోని దొడ్డేరి,కాకి బాజయ్యపాళ్యం, బి.జి హళ్లి,రొళ్ల ఎస్సీ కాలనీలో స్థానిక టీడీపీ మండల కన్వీనర్ దాసిరెడ్డి ఆధ్వర్యంలో తెలుగుతమ్ముళ్లు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి గడపకు వెళ్లి జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి ఎమ్.ఎస్ రాజు,ఎంపీ అభ్యర్థి బి.కే పార్థసారథికి ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని చంద్రబాబు నాయుడుని ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో టి.ఎన్.టి.యు.సి రాష్ట్ర కార్యదర్శి గురుమూర్తి,నియోజకవర్గ తెలుగు యువత ఉపాధ్యక్షులు బాలకృష్ణ, నియోజకవర్గం ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు కృష్ణమూర్తి పాల్గొన్నారు.

వైసీపీతోనే అందరికీ సంక్షేమం

విశాలాంధ్ర–పామిడి : పట్టణ పరిధిలోని పి.కొండాపురంలోని 1,2 వార్డులో వైసీపీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. చెన్నకేశవ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు, వైసీపీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. వైసీపీతోనే ఇంటింటికీ సంక్షేమం సాధ్యం. పథకాలన్నీ అందాలంటే మరోసారి వైసీపీపీ ప్రభుత్వం అధికారంలోకి రావాలన్నారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గుంతకల్ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి వైవెంకట్రామిరెడ్డి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం వైసీపీలోకి సునీల్ రెడ్డి ఆధ్వర్యంలో పి.ఆంజనేయులు, సిద్దయ్య, ఆదినారాయణ,పి రమేష్,వెంకట్ రాముడు, నరసింహ, బొద్దిరాజు, నాగయ్య, రామాంజనేయులు, సుధా, సి.సుధాకర్, ఎర్రిస్వామి, రమేష్, పి సుధాకర్, అనిల్, రాజశేఖర్, విజయ్, నాగరాజు, దాదావలి, కె.రామాంజనేయులు వైసీపీ కండువా కప్పుకొన్నారు.

జగనన్నను మరోసారి ముఖ్యమంత్రి చేసుకుందాం

విశాలాంధ్ర–ఎన్‌పి కుంట : రాష్ట్రంలో పార్టీలకు అతీతంగా ప్రజలకు జనరంజక పాలన అందాలంటే మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని వైకాపా నాయకులు మాజీ ఎమ్మెల్యే అత్తర్ చాంద్ బాషా పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని మర్రికొమ్మదిన్నె పంచాయితీ గంగినాయన పల్లి, జవుకుల, నల్లగుట్ట పల్లి, మర్రి కొమ్మదిన్నే, ఎర్రవంకలవారి పల్లి గ్రామాలలో ఇంటింటి ప్రచారం కార్యక్రమాన్ని మండల కన్వీనర్ కొత్త రంగారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. అత్తర్ చాంద్ బాషా మాట్లాడుతూ చంద్రబాబు అరాచక పాలనకు 2019లోనే ప్రజలు చరమగీతం పాడారని, టీడీపీని ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ ఆమోదించరని వివరించారు. వైయస్ జగన్ ఆధ్వర్యంలో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు, అభివృద్ధి గడప వద్దకు చేరుతున్నాయన్నారు. వైసీపీ తరపున పోటీ చేస్తున్న హిందూపురం పార్లమెంటు స్థానానికి బోయ శాంతమ్మ, కదిరి ఎమ్మెల్యే స్థానానికి బిఎస్ మక్బూల్ అహ్మద్‌ల ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

టీడీపీతో అన్ని వర్గాలకు లబ్ధి ...

విశాలాంధ్ర–గోరంట్ల : గోరంట్ల మండలం గుమ్మయ్యగారిపల్లి క్రాస్‌లో ఎమ్మెల్యే అభ్యర్థి కవితమ్మ భర్త వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ముమ్మరంగా ప్రచార కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ అధికారంలోకి రాగానే ప్రవేశపెట్టబోయే సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. వైసీపీ నాయకుల మాయమాటలు నమ్మి మోసపోవద్దని పెనుకొండ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి సవితమ్మకి, ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారథికి భారీ మేజా ర్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ టీసీ నిమ్మల యువశేఖర్, హరి, వృషభ దేవుడు పాల్గొన్నారు.

ఈరలక్కప్పను అత్యధిక మెజారిటీతో గెలిపించండి...

విశాలాంధ్ర–అగళి : మడకశిర వైసీపీ అభ్యర్థి ఈరలక్కప్పను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని మడకశిర అసెంబ్లీ ఇంచార్జ్ అనంత రాజు ప్రజలను కోరారు. మండల పరిధిలోని హెచ్.డి.హళ్లి, గాయత్రీ కాలనీ, సుగాలి తాండ, ఇరిగేపల్లి గ్రామాలలో వైసీపీ మహిళా కార్యకర్తలతో కలసి అనంతరాజు మంగళవారం గడప గడపకు వెళ్లి సీఎం జగన్ విడుదల చేసిన వైసీపీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. హిందూపురం ఎంపీ అభ్యర్థి బోయ శాంతమ్మను మడకశిర ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్పను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. పేదలు మరింత అభివృద్ధి చెందాలంటే జగన్మోహన్ రెడ్డి మరోసారి సీఎం కావాలన్నారు. టీడీపీ చెప్పే అబద్ధపు హామీలను నమ్మి మోసపోవద్దన్నారు.

20 కుటుంబాలు టీడీపీలోకి చేరిక

విశాలాంధ్ర–బొమ్మనహాల్: మండలంలోని దర్గా హొన్నూరు గ్రామంలో వైసీపీ నుండి 20 కుటుంబాలు మంగళవారం టీడీపీలోకి చేరారు. మాజీ సర్పంచ్ కేశప్ప అధ్వర్యంలో బలిజ తిప్పేస్వామి సోదరలు, బండి వన్నూరు స్వామి, కురుబ పాల్తూరు వన్నప్ప, గంగాధర, డిజిల్ రామాంజి, చంద్ర, చన్నప్ప, వంద్రప్ప, నాగరాజు, క్రిష్ణ, వన్నూరుస్వామిలతో పాటు 10 కుటుంబాలు టీడీపీలోకి తెలుగుదేశం అభ్యర్థి కాలవ శ్రీనివాసులు సమక్షంలో చేరారు. చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని అన్నారు.

గిరిజన సంఘం నాయకుడిపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

విశాలాంధ్ర–ఉరవకొండ : ఆంధ్రప్రదేశ్ ఎరుకుల సేవా సంఘం ఉరవకొండ నియోజవర్గ ప్రధాన కార్యదర్శి విద్యార్థి, గిరిజన సంఘాల్లో పనిచేస్తున్న ఎరుకుల పురుషోత్తంపై జరిగిన దాడిని ఆంధ్రప్రదేశ్ ఎరుకుల సేవా సంఘం తీవ్రంగా ఖండిస్తోందని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి కోలేగుండ్ల శేఖర్ తెలిపారు. మంగళవారం ఉరవకొండలో విలేకరులతో మాట్లాడుతూ ఆదివారం రాత్రి గాజుల సందీప్,గాజుల మారుతి, జయ, రవి, శివమణి ప్రశాంత్, అనిల్ తదితర వ్యక్తులు ఎరుకుల పురుషోత్తంపై అకారణంగా విచక్షణారహితంగా దాడి చేసి గాయపరిచారని నిందితులను వెంటనే అరెస్టు చేసి ఎస్సీ, ఎస్టీ అట్రాక్సిటీ కేసు నమోదు చేసి అటెంప్ట్ మర్డర్ కేస్ నమోదు చేయాలని ఆంధ్రప్రదేశ్ ఎరుకుల సేవా సంఘం తరపున డిమాండ్ చేశారు. సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ఎరుకుల సేవా సంఘం ఉరవకొండ నియోజకవర్గ అధ్యక్షులు సాకే వసంత్ ఉరవకొండ టౌన్ ప్రెసిడెంట్ వీరేంద్ర, ఎరుకుల శేషాద్రి పాల్గొన్నారు.

వైసీపీతోనే సంక్షేమం సాధ్యం

విశాలాంధ్ర–తాడిపత్రి : పట్టణంలోని జయనగర్ కాలనీలో మంగళవారం ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి సతీమణి కేతిరెడ్డి రమాదేవి తన భర్త వైసిపి అభ్యర్థి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిని గెలిపించాలని ఇంటింటా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో ఎన్ని ప్రభుత్వాలు అధికారం చేపట్టినప్పటికీ అర్హులైన ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు అందేవి కాదన్నారు. ఎందుకంటే ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తున్న మధ్యలో పేదలకు అందకుండా నీరుగారి పోతూ ఉండేది అన్నారు. అలాంటిది వైయస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి, వాలంటీర్ల నియమించి అర్హులైన ప్రతి ఒక్క పేదవాడి ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందించిన ప్రభుత్వం ఒక వైసీపీ ప్రభుత్వమే అన్నారు. కావున రాబోవు ఎన్నికల్లో వైసిపికి ఓటు వేసి, వేయించి అత్యధిక మెజార్టీతో ఎమ్మెల్యే అభ్యర్థి కేతిరెడ్డి పెద్దారెడ్డిని గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో వైసీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి గంగులకుంట కేశవర్ధన్ రెడ్డి, వైసీపీ జిల్లా మహిళా కార్యదర్శి నూర్ షరీఫా, కేతిరెడ్డి అభిమానులు, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

విశ్వేశ్వరరెడ్డికి అపూర్వ ఆదరణ

విశాలాంధ్ర–కూడేరు: పి.నారాయణపురంలో మంగళవారం వైసీపీ ఎన్నికల ప్రచారం నిర్వహించింది. ప్రచారానికి వచ్చిన వైస్సార్సీపీ ఉరవకొండ ఎమ్మెల్యే అభ్యర్థి వై.విశ్వేశ్వరరెడ్డికి గ్రామస్తుల నుంచి అపూర్వ ఆదరణ లభించింది. నాయకులు, ప్రజాప్రతినిధులు మాజీ ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. మహిళలు హారతులు పట్టి ఆహ్వానించారు. యువత పులవర్షం కురిపించారు. గజమాలతో స్వాగతం పలికారు. అనంతరం ప్రచార రథంపై రోడ్‌షో నిర్వహిస్తూ ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు కదిలారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటు వేసి జగన్మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

జగనన్నను ఎన్నికల్లో దీవించండి...

విశాలాంధ్ర–పెనుకొండ: పెనుకొండ నగర పంచాయతీ పరిధిలోని 8వ వార్డు కౌన్సిలర్ ప్రజీయ భాను ఆధ్వర్యంలోనూ 6వ వార్డు కౌన్సిలర్ షేక్ నబియా భాను ఆధ్వర్యంలో మంగళవారం వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఉష్రశ్రీ చరణ్ చెల్లెలు జోత్స్న ఆధ్వర్యంలో రెండు ఏరియాల్లోనూ గడప గడపకు వెళ్లి వైయస్ జగన్మోహన్ రెడ్డిని మరలా దీవించాలని పెనుకొండ నియోజకవర్గం పోటీ చేస్తున్న ఉష్రశ్రీ చరణ్‌ను హిందూపురం పార్లమెంట్ అభ్యర్థిగా పోటీచేస్తున్న శాంతమ్మను దీవించాలని కోరారు. సంక్షేమ పథకాలు నిరాటంకంగా రావాలంటే జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి పేదవాడు నవరత్నాలతో లబ్ధి పొందాడని ఓటర్లను ఓట్లు అభ్యర్థించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ ఉమర్ ఫరూక్, వైస్ చైర్మన్లు సునీల్, జయ శంకర్‌రెడ్డి, కన్వీనర్ నరసింహ, కౌన్సిలర్లు సుధాకర్‌రెడ్డి, రఘునాథ్‌రెడ్డి సద్దాం, తయుబ్, భాస్కర్‌నాయక్, మారుతి, రామాంజనేయులు, శేషాద్రి, శ్రీరాములు పాల్గొన్నారు.

టీడీపీ రోడ్‌షోను విజయవంతం చేయండి....

తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు

విశాలాంధ్ర–శింగనమల : శింగనమల మండలం తరిమెల గ్రామంలో బుధవారం సాయంత్రం 4 గంటలకు నిర్వహించు రోడ్‌షోను విజయవంతం చేయాలని తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు కోరారు. కార్యక్రమానికి టీడీపీ, బీజేపీ, జనసేన, ఉమ్మడి అభ్యర్థి బండారు శ్రావణి శ్రీ అనంతపురం పార్లమెంట్ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ శింగనమల నియోజక వర్గం ద్విసభ్య కమిటీ సభ్యులు ముంటిమడుగు కేశవరెడ్డి ఆలంనర సానాయుడు హాజరవుతున్నందున ఆయా పార్టీల నాయకులు, క్లస్టర్ ఇం చార్జిలు యూనిట్ ఇంచార్జిలు బూత్ కన్వీ నర్లు, గ్రామ కమిటీ అధ్య క్షుడు, మాజీ ఎంపీటీలు సర్పంచులు, హాజరై విజయవంతం చేయాలని కోరారు.

భారతీయ అంబేద్కర్ మిషన్ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఫటాన్ అబ్దుల్ రహిమాన్

విశాలాంధ్ర–పామిడి: అనంతపురం జిల్లాకు చెందిన దేశ, విదేశీ సామాజిక సంఘ సేవకులు పటాన్ అబ్దుల్ రహమాన్ (బిఎయం)కు ప్రధాన కార్యదర్శిగా ఎన్నికకావడం జిల్లాకే గర్వకారణమని ఆ సంస్థ సభ్యుడు పామిడి వాల్మీకి గోపాల్ పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. అనంతపురం జాతీయ వినియోగదారుల కమిషన్ అండ్ అడ్వైజర్ బోర్డ్ చైర్మన్ న్యూఢిల్లీ అయిన పటాన్ అబ్దుల్ రహమాన్‌ను భారతీయ అంబేద్కర్ మిషన్ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకోబడిన శుభ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ భారతీయ అంబేద్కర్ మిషన్ రాష్ట్ర అధ్యక్షుడు బుటారి అరుణ్‌కుమార్, జాతీయ కార్యదర్శి దేవరపల్లి గోపాల్ డాక్టర్ పటాన్ అబ్దుల్ రహమాన్‌కు అభినందనలు తెలిపారు.

ఘనంగా పంచాయతీ కార్యదర్శి పదవీ విరమణ వీడ్కోలు సమావేశం

విశాలాంధ్ర–హిందూపురం : హిందూపురం రూరల్ పరిధిలోని కిరికెర పంచాయతీ కార్యదర్శి వేణుగోపాల్ పదవి విరమణ వీడ్కోలు సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కిరికెర పంచాయతీ సర్పంచ్ భాగ్యమూర్తి, డాక్టర్ కే.శివశంకర్ స్పెషల్ జ్యూడిషల్ మెజిస్ట్రేట్ అనంతపురం, ఏజీ. నటరాజ్, జిబి గోపాల్ రిటైర్డ్ సెక్షన్ ఆఫీసర్ హైకోర్టు, జి వెంకటేశ్వర్ రెడ్డి మండల పరిషత్ అభివృద్ధి అధికారి, జి విజయకుమార్ సత్యసాయి జిల్లా పంచాయతీ అధికారి ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడుతూ 1993లో జైలు డిపార్ట్మెంట్లో రెండు సంవత్సరాలు పని చేశారని, 1995లో పంచాయతీరాజ్ డిపార్ట్మెంట్లో జూనియర్ అసిస్టెంట్‌గా రాయదుర్గంలో పనిచేశారని, కనేకల్లు పరిగి తదితర ప్రదేశాల్లో పని చేస్తూ అంచలంచెలుగా ఎదిగి ఈఓ, జూనియర్ 2 పంచాయతీ కార్యదర్శి గా అమరాపురంలో పనిచేస్తూ పదోన్నతపై, ఈవో జూనియర్ 1 పంచాయతీ కార్యదర్శిగా చిత్తూరు జిల్లా రామకుప్పంలో పనిచేస్తూ, ప్రత్యేక ప్రభుత్వ జీవో ద్వారా మన గ్రామ పంచాయతీ కార్యదర్శిగా కిరికెరలో గ్రేట్ వన్‌గా బదిలీపై రావడం జరిగిందని తెలిపారు.

జిల్లా కేంద్రంలో రూ.1.99 కోట్లు పట్టివేత

విశాలాంధ్ర, అనంతపురం వైద్యం : డీఎస్పీ జి.వీరరాఘవరెడ్డి జిల్లా కేంద్రంలోని విద్యుత్ నగర్ సర్కిల్‌లో మంగళవారం ఉదయం టూటౌన్ సి.ఐ క్రాంతికుమార్, ఎస్సై రుష్యేంద్ర బాబు ఫ్లయింగ్ స్క్వాడ్ టీం ఇంఛార్జి భీమలింగేశ్వర్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టారు. ఫార్చునర్ వాహనాన్ని వాహనాల తనిఖీ పోలీసులు ఆపి క్షుణ్ణంగా చెక్ చేశారు. అందులో రెండు బ్యాగులలో అక్రమంగా తరలిస్తున్న రూ.1,99,97,500/- నగదును పోలీసులు సీజ్ చేశారు. ఫార్చునర్ వాహనం రికార్డులను పరిశీలించగా...సదరు వాహనం కదిరి తెదేపా అభ్యర్థి కందికుంట వెంకట ప్రసాద్ పేరున ఉన్నట్లు తేలింది. తదుపరి చర్యల నిమిత్తం అనంతపురం ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అప్పగించారు

ఎండలో ఉపాధి కూలీలు జాగ్రత్తలు తీసుకోవాలి

విశాలాంధ్ర–ఉరవకొండ : రాకెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర హెల్త్ సూపర్వైజర్ శేఖర్ ఆధ్వర్యంలో మంగళవారం వైద్య సిబ్బంది రాయంపల్లి వద్ద ఉపాధి హామీ కూలీలకు వడదెబ్బ గురించి అవగాహన కలిగించారు. ఉదయం పది గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల మధ్య ఎండలో తిరగరాదని అలా తిరిగిన వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉందని వివరించారు. నేరుగా ఎక్కువ సమయం ఎండలో పనిచేయడం వలన శరీరంలో నీరంతా చెమట రూపంలో వెళ్లిపోవడం శరీరం నిర్జలీకరణకు గురై వడదెబ్బ తగులుతుందని అధికజ్వరం తలనొప్పి మగతగా ఉండడం అధిక దాహం వేయడం తూలుతూ నడవడం లాంటి లక్షణాలు ఉంటాయని ఇలాంటి లక్షణాలు ఉన్న ప్పుడు వడదెబ్బగా భావించి వెంటనే నీడ పాటుకు చేర్చి దుస్తులు వదులు చేసి వాళ్లంతా తడుగుడ్డతో తుడుస్తూ తాగగలిగితే నీరు లేదా ఓ ఆర్ ఎస్ ద్రావణం త్రపుతూ వీలైనంత త్వరగా ఆసు పత్రికి తరలించాలని సూచించారు. వేసవిలో బయట తిరిగేటప్పుడు వెంట నీరు తీసుకెళ్లాలని కాలికి చెప్పలు ధరించాలని తలకు టోపి లేదా రుమాలు ధరించాలని సూచించారు. నల్లటి దుస్తులు ధరించరాదని తెల్లటి కాటన్ దుస్తులు ధరించాలని , మద్యపానం ధూమపానం చేయరాదని మసాలా తిండి జోలికి వెళ్లరాదని సూచించారు. అనంతరం కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది సలీమా బేగంలు, భగవాన్ దాస్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.